క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేటలోని విష్ణుపురి, జూబ్లీ మార్కెట్, సుబ్బయ్యపల్లి వ్యవసాయ ఫీడర్, సోమిడి వ్యవసాయ ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ ఇన్‌చార్జ్ డీఈ తిరుపతి తెలిపారు. శివనగర్, చింతల్, ఏఎస్.రెడ్డి నగర్, తూర్పు కోట, పడమర కోట, మధ్య కోట, పుప్పాల గుట్ట ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రవీణకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం పరిశోధకురాలు ఎం.ప్రవీణకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఈక్విసిషన్ త్రో పర్పస్‌ఫుల్ యాక్టివిటీస్ ఫర్ యూజీ స్టూడెంట్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ప్రవీణకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఇంగ్లిష్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ దామోదర్ పర్యవేక్షణలో ప్రవీణ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

శరభేశ్వరుల కల్యాణం



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని ప్రత్యంగిర భైరవ సహిత శివశక్తి దేవాలయంలో గురువారం ఉదయం ప్రత్యంగిర శరభేశ్వరి కల్యాణ వేడుకలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపు, బోనాలు సమర్పించారు. అనంతరం పల్లకిలో ఊరేగించారు.

16న డ్రాయింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: మాతృభాషా దినోత్సవం (ఫిబ్రవరి 21) సందర్భంగా ఈనెల 16వ తేదీన హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ మంజుల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మాతృభాషా – ప్రాధాన్యత' అనే అంశంపై ఆదివారం ఉదయం 9గంటలకు పోటీలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిరుపేదకు గ్యాస్ స్టౌ, సిలిండర్ బహూకరణ



వరంగల్ చౌరస్తా: వరంగల్ బట్టలబజారు ఆంధ్రబాలిక కళాశాల వద్ద ఉన్న నిరుపేద ఆర్యవైశ్యుడు బోనగిరి ఉప్పలయ్యకు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు గురువారం గ్యాస్ పొయ్యి, సిలిండర్లను బహూకరించారు. అవసరమైన చేయూతనిస్తూ ఆదుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వీరమల్లయ్య, రవ్వ కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఫుడ్ ఫెస్టివల్

నయీంనగర్: కేయూసీ రోడ్డులోని ఏకశిల పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల సహకారంతో ఆహార పదార్థాలను తయారు చేసుకొని వచ్చి, తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సమానత్వం, స్నేహం, పంచుకునే గుణం పెంపొందుతుందని ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి అన్నారు. తమ పాఠశాలలో ఇలాంటి అనేక కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీపిక, రజిత, స్వాతి, సాయిరాం, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌సీటీఏ డైరీ ఆవిష్కరణ



రామన్నపేట: నగరంలోని ఎల్‌బీ కళాశాలలో తెలంగాణ రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీఆర్‌సీటీఏ) డైరీ –2025ని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్‌సీటీఏ కార్యదర్శి టి.భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు ధర్మేంద్ర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ కళాశాలల విశ్రాంత అధ్యాపకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నమ్మిన వారే నట్టేట ముంచారు

- వ్యవసాయాధికారులపై చర్యలేవి?
- టీఆర్‌ల జారీలో డీఓల చేతివాటం
- పర్యవేక్షణ లోపంతో కార్యదర్శులు బలి

వరంగల్ : 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందం'గా తయారైంది రాష్ట్ర మార్కెటింగ్ శాఖ నిర్ణయాలు. సుమారు ఐదు నెలలుగా పత్తిని సీసీఐ కొనుగోళ్ల చేసినా పట్టించుకోని అధికారులు.. సీజన్ ముగుస్తున్న తరుణంలో జారీ చేసిన టీఆర్ (టెంపరరీ రిజిస్ట్రేషన్)లో తప్పులు ఉన్నాయని పేర్కొంటూ ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అక్టోబర్ నుంచి పత్తి సీజన్ ప్రారంభమై మార్చి వరకు సాగుతుంది. డిసెంబర్, జనవరి నెలల్లో పత్తి వేల క్వింటాళ్లలో సీసీఐ కేంద్రాలకు తరలి వస్తుంది. ఈ సమయంలో జారీ చేసిన టీఆర్‌లలో తప్పులు ఉన్నాయంటూ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయం నాలుగు రోజుల క్రితం తెలియడంతో



సదరు కార్యదర్శులు హుటాహుటిన హైదరాబాద్‌కు వెళ్లి సంబంధిత శాఖ అధికారులను కలిశారు. ఈ విషయంలో తమ తప్పు లేదని, వ్యవసాయ అధికారులు ఇచ్చిన పత్రాలతోనే టీఆర్‌లు జారీ చేశామని, సిబ్బంది కొరతతో పర్యవేక్షణలో లోపం జరిగి ఉంటుందని కార్యదర్శులు ఏకరవు పెట్టినట్లు తెలిసింది. అప్పటికే సస్పెన్షన్ ఉత్తర్వులు సిద్ధం కావడంతో ఈ సమయంలో నిర్ణయం వెనక్కి తీసుకోవడం సరికాదని, 15 రోజుల్లో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హామీ ఇవ్వడంతో కార్యదర్శులు తిరుగుపయనమయ్యారు.

టీఆర్‌ల జారీలో డీఓల చేతివాటం

సీసీఐ పత్తి కొనుగోళ్ల కోసం జారీ చేసిన టీఆర్‌ల విషయంలో ఆయా మార్కెట్లలో పనిచేస్తున్న డీఓలు (డాటా ఎంట్రీ ఆపరేటర్లు) చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలున్నాయి. డిజిటల్ కీని కార్యదర్శులు కంప్యూటర్ డీఓల వద్ద ఉంచడం వల్ల ఓటీపీ రాగానే వ్యవసాయ అధికారులు ఇచ్చిన దానికంటే ఎక్కువ విస్తీర్ణం నమోదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ తప్పుడు ఎంట్రీలే కార్యదర్శుల మెడకు సస్పెన్షన్ ఉచ్చుగా మారాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో ఒక్కో డీఓ పెద్ద మొత్తంలో అక్రమార్జన చేసినట్లు తెలుస్తోంది. ఐదు నెలల పాటు ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నా మార్కెట్ అధికారులతో పాటు ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై సంబంధిత శాఖ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోనే ఉంటే క్షేత్రస్థాయిలో అవకతవకలు జరుగుతాయని, ఒక్కో ఉన్నతాధికారి ఒక్కో మార్కెట్‌ను సందర్శించి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతోనే రాష్ట్ర అధికారులు మార్కెట్ల బాట పట్టినట్లు సమాచారం.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీ, లోటస్ కాలనీ, ప్రకాశ్ రెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇందిరమ్మ కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఏనుగుల మానస, డివిజన్ అధ్యక్షుడు రాజమల్లారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, బంక సంపత్, నాయకులు రఘుపాల్ రెడ్డి, రాజు, కిరణ్, సమద్, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సంచుల బ్రోచర్ ఆవిష్కరణ

హన్మకొండ చౌరస్తా: బయోడిగ్రేబుల్ ఇండియన్ ప్రైవేట్ సంస్థ తయారు చేస్తున్న చెత్త సేకరణ సంచుల బ్రోచర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత చెత్త సేకరణ సంచులను తయారు చేసిన సంస్థ యజమాని నితిన్‌ను ఎమ్మెల్యే అభినందించారు.



రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి ఇందిరమ్మకాలనీకి వెళ్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, నాయకులు

క్యాలెండర్ ఆవిష్కరణ

కాజీపేట: తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కాజీపేట పట్టణంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నూతన క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు.

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు వలంటీర్లు

కేయూ క్యాంపస్: కేరళలోని పాలక్కాడ్ లీడ్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ తిరువనంతపురంలో జాతీయ సేవాపథకం రీజియన్ ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి 21వ తేదీ వరకు జరగనున్న నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు కేయూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికైనట్లు కేయూ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు. ఈమేరకు జాబు శ్రీజ, ప్రతాప్, వికాస్ (బయో టెక్నాలజీ), షేక్ యాకూబ్ (ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల), పి.శ్రేష్ఠ (వరంగల్ కిట్స్), వినీల (ప్రభుత్వ పింగిళి కళాశాల), జి.నిఖిత (కాకతీయ మహిళా డిగ్రీ కళాశాల), జె.లలితకుమారి (వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల), బి.శివకుమార్ (కేడీసీ), రావుల శ్రీధర్ (వరంగల్ ఎల్‌బీ కళాశాల)ను



వలంటీర్లతో వీసీ ప్రతాప్‌రెడ్డి, ఈసం నారాయణ

యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం గురువారం అభినందించారు. వలంటీర్లకు కాంటిజెంట్ లీడర్‌గా హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రజనీకుమార్ వ్యవహరించనున్నారు.

ప్రజలతో పోలీసులు మమేకమై పనిచేయాలి



కాజీపేట: ప్రజలతో పోలీసులు మమేకమై పనిచేయాలని సీపీ అంబర్ కిశోర్‌ఝూ ఆదేశించారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించి పలు అంశాలపై సిబ్బందికి సీపీ దిశానిర్దేశం చేశారు. స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ సుధాకర్ రెడ్డితో పాటు సిబ్బందిని అభినందించారు.

రెనాల్డ్ పాఠశాల తనిఖీ

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని రెనాల్డ్ స్కూల్‌ను వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. నిబంధనల ప్రకారం కొనసాగించాలని సూచించారు. లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట ఎంఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వరంగల్: వర్ధన్నపేట నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆకులపల్లి శ్రీకాంత్, బోని నరేష్‌కు చెందిన ట్రాక్టర్లను పోచమ్మమైదాన్ సెంటర్‌లో పట్టుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకుర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చిరుధాన్యాలు తీసుకోవాలి



హన్మకొండ: బాల్యం నుంచే చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపు మత్యాస్ రెడ్డి అన్నారు. హనుమకొండ హౌజింగ్‌బోర్డు కాలనీలోని పాఠశాలలో రికార్డ్ మిల్లెట్ హబ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో మిల్లెట్ కుకింగ్ నిపుణురాలు కుసుమ కవిత, స్కూల్ డైరెక్టర్ జి.సునీత, సామాజికవేత్త, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రచార కరపత్రం ఆవిష్కరణ

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్ రోడ్డులో బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి అధ్యాపకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరై వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కర్నె రవీందర్, సింగరబోయిన నాగరాజు, మద్దూరి శివ, సురేష్ పాల్గొన్నారు.

మా స్కూటీలు ఎక్కడ?

నయీంనగర్: విద్యార్థినులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారని ఆర్‌డీ కళాశాల విద్యార్థినులు కళాశాల ఎదుట బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలను ప్రదర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెట్టి రాజేందర్, రంజిత్, రాకేష్, అశోక్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్, బీఎన్.రెడ్డి వంటి బహిష్కృత నేతలే ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న చందర్‌రావు

వరంగల్ చౌరస్తా: పోరాట యోధులు ఓంకార్, బీఎస్.రెడ్డి వంటి బహిష్కృత నేతలు తమకు ఆదర్శమని ఎంసీపీఐ నేత మోర్తాల చందర్ రావు అన్నారు. వరంగల్ అబ్బనికుంటలోని రైతు భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎంసీపీఐ నుంచి బహిష్కరణకు గురైన చందర్‌రావు, సాంబయ్యలు.. ఓంకార్ పేరు ఎత్తడానికి అర్హులు కారని అన్నారు. మెజార్టీ తీర్మానం అనే పేరుతో గ్రూపు రాజకీయాలు చేసి నాయకుల బహిష్కరణ పేరుతో మాస్ నాయకులను బహిష్కరించారని అన్నారు. అత్యంత కీలకమైన ఓంకార్, బీఎన్ రెడ్డి, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, కొండపల్లి సీతారామయ్య లాంటి మహనీయులు బహిష్కరణకు గురైన ఫలితంగా అనేక పార్టీలు పుట్టుకొచ్చాయని, ఈక్రమంలోనే ఎంసీపీఐ ఏర్పడిందని గుర్తించాలని సూచించారు. ఓంకార్ పేరును చిరస్థాయిగా నిలపాలని ఆసియా ఖండంలోని అతిపెద్ద స్తూపాన్ని కట్టించిన చరిత్ర తమకు ఉందన్నారు. సమావేశంలో నాయకులు సింగతి సాంబయ్య, పానుగంటి నరసయ్య, బిట్ల సమ్మయ్య, బాసిపాక రమేష్, బలుసునూరి నరసయ్య, మాదం తిరుపతి, మాలోత్ రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలను విస్మరించిన ప్రభుత్వం'

ఖిలా వరంగల్: ఎన్నికల హామీలను విస్మరించి కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తోందని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. ఈక్రమంలో త్యాగాల పునాదులపై కష్టజీవుల రాజ్యాన్ని స్థాపించేందుకు ఎర్రజెండా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. వరంగల్ ఎస్ఆర్ఆర్ తోటలో నాయకుడు మల్లికార్జున్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ శక్తుల ఆస్తులు లక్షల కోట్లకు పెరుగుతున్నా.. శ్రమజీవులకు నిత్యావసరాలు కూడా తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు భూమి, ఇళ్లు, ఇళ్ల స్థలాలు – ప్రభుత్వ విధానాలు – మన కర్తవ్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనే అంశంపై సదస్సులు, సెమినార్లు, రౌండ్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో నర్ర ప్రతాప్, సంచు జగదీశ్వర్, ఐతం నాగేష్, రాజేందర్, శ్రీను, మార్కండేయ, మాలి ప్రభాకర్, అప్పన్న, నరసయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రామన్నపేట: ఈనెల 11, 12వ తేదీల్లో హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. బాలుర, బాలికల విభాగంలో ఖోఖో, షటిల్ (సింగిల్స్, డబుల్స్), టేబుల్ టెన్నిస్ (సింగిల్స్, డబుల్స్), చెస్ విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు వివరించారు. విజేతలుగా నిలిచి పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్, పీడీ సంపత్, లెక్చరర్ టి.శ్రీనివాస్‌రావు, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, సిబ్బంది గురువారం అభినందించారు.

వీసీని కలిసిన ఫార్మసీ పూర్వ విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల స్వర్ణోత్సవాలు ఈఏడాది నవంబర్ – డిసెంబర్‌లలో నిర్వహించనున్నారు. ఈమేరకు అలుమ్నీకి చెందిన కేయూ, జేఎన్‌టీయూ అనుబంధ ఫార్మసీ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు, విభాగాల అధిపతులు, పరిశోధకులుగా కొనసాగుతున్న కొంతమంది పూర్వ విద్యార్థులు గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిను కలిశారు. కేయూ ఫార్మసీ కళాశాల స్వర్ణోత్సవాల అలుమ్నీ మీట్‌ను కేయూలోనే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీఆర్, డాక్టర్ నేరెళ్ల రఘునందన్, కమల్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, బాబురావు,



పూలమొక్క అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్, సునీల్, శ్రవణ్, రమేష్, సందీప్, అఫ్జల్, హఫీజ్, బొమ్మ రమేష్, సాంబశివరావు, బస్వరాజ్, అమ్మ వేణు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న నరేందర్

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలా వరంగల్: కులగణన సర్వేలో బీసీ జనాభాను సుమారు ఐదున్నర శాతం తక్కువ చూపించి, బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. వరంగల్ శివనగర్‌లోని సాయి కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో కేసీఆర్ చేయించిన సర్వేలో 51 శాతం మంది బీసీలు ఉంటే, ఇప్పుడు కేవలం 42శాతంగా పేర్కొనడం ఏంటని ప్రశ్నించారు. రీసర్వే పేరుతో బీసీలను కాంగ్రెస్ మళ్లీ మోసం చేయాలని చూస్తోందని అన్నారు. స్థానిక మంత్రి కొండా సురేఖ బీసీ అయి ఉండి కూడా బీసీలకు మోసం జరుగుతుంటే మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మార్కెట్ మాజీ చైర్మన్ టీ.రమేష్‌బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

నయీంనగర్: బిల్లులు వెంటనే చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (కాంట్రాక్టర్స్ అసోసియేషన్) వరంగల్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు గురువారం నిరసన తెలిపారు. ఈమేరకు ఎస్ఈ నాగేందర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే పాత బకాయిలు మొత్తం చెల్లించాలని, ప్రభుత్వ మొండివైఖరి నశించాలని కాంట్రాక్టర్లు నినదించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.దేవేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,డి.సంపత్ రావు, ఎస్.రాజిరెడ్డి, మంద ఐలయ్య, ఎం.రవీందర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని కమ్యూనిటీ హాల్‌లో రాణి రుద్రమదేవి స్వచ్ఛంద సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వీబీ.నిర్మల గీతాంబ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్త్రీలు కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపకపోవడం వల్ల అనారోగ్యం బారినపడుతున్నాయని అన్నారు. అనంతరం స్థానిక వైద్యులతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు.. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ వరంగల్ కార్యదర్శి సాయికుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ మోహన్‌సింగ్, సీఐ వెంకటరత్నం, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జస్టిస్ నిర్మల గీతాంబ

మహాశివరాత్రి ఉత్సవాల పనులు ప్రారంభం

వరంగల్: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఈనెల 22నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల పనులను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను జేసీబీతో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గోనె జగదీశ్వర్, మండల శ్రీరాములు, కొమురయ్య, వైకుంఠం, పాశికంటి



పనులను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రమేష్, మామిడి ఈశ్వరయ్య, భాస్కర్, గోరంటల రాజు, రమేష్‌బాబు, సదానందం పాల్గొన్నారు.

ఊయలా.. విద్యుత్ తీగలా?

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 10వ డివిజన్ పరిధిలోని పద్మాక్షికాలనీలో విద్యుత్ తీగలు ఊయలను తలపిస్తున్నాయి. గాలులు బాగా వీస్తే షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరిచేయాల్సిన విద్యుత్ అధికారులకు అనేక సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.



కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఆర్ఓ ప్లాంట్, గోశాల ప్రారంభం



ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న క్లబ్ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుల దేవస్థానం ఆవరణలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్, వాసవియన్ డైమాండ్, వాసవి క్లబ్, స్మార్ట్ సిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్, గోశాలను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వాసవియన్ డైమండ్ స్టార్ కేసీజీఎఫ్ ఇరుకుల్ల రామకృష్ణ, కార్యదర్శి గార్లపాటి శ్రీనివాస్, వాసవి క్లబ్ స్మార్ట్ సిటీ అధ్యక్షుడు అల్లంకి సంతోష్, కార్యదర్శి బల్లి నరేష్ కుమార్, కోశాధికారి సతీష్ కుమార్, జోన్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, రీజియన్ చైర్మన్ ప్రతిభా సంకల్ప, పుల్లూరు శ్రీధర్, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, తోట వైద్యనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంగ్లిష్ డే వేడుకలు

కాశోజీ సెంటర్: ఆంగ్ల భాషలో ఎన్నో రచనలు చేసి స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తి రగిలించిన భారత కోకిల సరోజినీనాయుడు జయంతిని ఇంగ్లిష్ డేగా నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గురువారం వరంగల్ కరీమాబాద్ పాఠశాలలో ఇంగ్లిష్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరోజినీనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజమౌళి, ఉపాధ్యాయులు పోగు అశోక్, వెంకటరమణ, కరుణమూర్తి, రాజ్‌కుమార్, కొండా శ్రీనివాస్, శ్రీవాణి, తిలక్, శైలజ, గౌస్ మొహినుద్దీన్, ప్రగత్‌కుమార్, అనూష, మురళి, నారాయణరెడ్డి, విశ్వప్రసాద్, పావని, అనిల్ కుమార్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వరంగల్ అర్బన్:

9951602875 9553955722

9010299096

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)